వైకుంఠ వాసా.. గోవిందా..!

- ఘనంగా వైకుంఠ ఏకాదశి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

చిత్తూరు రూరల్: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని చిత్తూరులోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే వైకుంఠ వాసా గోవిందా.. గోవిందా అంటూ భక్తుల నామస్మరణతో మార్మోగాయి. ఈశ్వరగుడివీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వేదపండితులు స్వామికి అభిషేక పూజలు చేయించి భక్తులను దర్శనభాగ్యం కల్పించారు. అలాగే ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. పూజార్చనల అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఇక, రాములుగుడివీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో, కట్టమంచిలోని శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో స్వామివారిని విశేషంగా అలంకరించి వైకుంఠ ఏకాదశి పూజలు చేశారు. వివిధ వాహన సేవల్లో స్వామి భక్తులను కనువిందుచేశారు.

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వారం దర్శనం కల్పించారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయం, నలగాంపల్లెలో దేవరకొండపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నలగాంపల్లెలో వెంకటేశ్వరాలయంలో ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. చిత్తూరు భాస్కర హోటల్ నిర్వాహకులు జయప్రకాష్, కుటుంబ సభ్యులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే, మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ, బంగారుపాళెంలో గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయంతో పాటు వివిధ ఆలయాలలో ముక్కోటి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు.

మొగిలి వెంకటగిరిలో గ్రామోత్సవం

మొగిలి వెంకటగిరిలోని పురాతన ఆలయమైన శ్రీకోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల మూల విగ్రహాలకు అభిషేకాలు, పూజల అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పుర వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సర్పంచ్ దీప్తిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక శ్రీ కోదండ రామాలయాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు దర్శించారు. ఆలయంలో సీతారామలక్ష్మణులకు, ఆంజనేయస్వామికి అభిషేకం, పూజలు, అర్చనలు చేయించి మొక్కులు చెల్లించారు. తొలుత ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అలాగే, టి.పుత్తూరులోని పురాతన శ్రీ కోదండరామాలయంలో ఉత్తర ద్వారం (వైకుంఠ ద్వారం)లో భక్తులు సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు. రాత్రి గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడు కొలువుదీరి పురవీధుల్లో విహరించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు శంకరరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఐరాలలో..

ఐరాల: మండలంలో పాలకలలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామికి అభిషేకాలు నిర్వహించి, తిరుప్పావై సేవను నిర్వహించారు. అనంతరం వివిధ సుగంధ పుష్పమాలలతో అలంకరించి హారతులిచ్చారు. భక్తులు గోవింద నామస్మరణలతో ఉత్తరద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

యాదమరిలో..

యాదమరి: స్థానిక త్రివేణి సంగమంలోని ఇంద్రవరదుని ఆలయంలో శ్రీదేవి, పెరుందేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. ఇంద్రవరదుని ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై ఆశీనులు చేసి, సుగంధ పుష్పాలతో అలంకరించి, వీధుల్లో ఊరేగించారు. అలాగే, ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో శివలింగం, పార్వతీదేవి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.


కాణిపాకం: ఉత్సవమూర్తులకు కర్పూర హారతి


తవణంపల్లె: టి.పుత్తూరు కోదండ రామాలయంలో..


చిత్తూరు రూరల్: ప్రత్యేక అలంకరణలో శ్రీ వేంకటేశ్వరస్వామి


కాణిపాకం : ప్రాకారోత్సవంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు


యాదమరి: గరుడవాహనంపై ఇంద్రవరదుడు


బంగారుపాళెం: మొగిలి వెంకటగిరిలో సీతారాముల గ్రామోత్సవం


చిత్తూరు రూరల్: కిటకిటలాడుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం


ఐరాల: విశేషాలంకరణలో లక్ష్మీనారాయణస్వామి


యాదమరి: ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి


చిత్తూరు రూరల్: క్యూలో వేచియున్న భక్తులు

క్లుప్తంగా

'ఆయుష్మాన్ భారత్' సర్వే పూర్తి చేయండి

చిత్తూరు రూరల్: మండలంలో ఆయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో ఆయన సోమవారం సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయుష్మాన్ హెల్త్ కార్డులకు సంబంధించి వలంటీర్ల పరిధిలో చాలా వరకు సర్వే పెండింగ్‌లో ఉందని, రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ఫోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శైలజ


శైలజ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఫోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్స్) న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వి.శైలజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరుకు చెందిన శైలజ నెలకు రూ.40 వేల గౌరవ వేతనంతో ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

సామాజిక సేవలో ముందుండాలి


డీపీటీఓకు నోటుపుస్తకాలు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు రూరల్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్టీసీ ఉద్యోగులు కూడా ముందుండాలని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండులోని తన కార్యాలయంలో సోమవారం ఆయనకు ఆర్టీసీ ఉద్యోగులు నోటుపుస్తకాలు, బ్యాగులు, దుస్తులు, నిత్యావసర సరుకులను అందజేశారు. వీటిని పేద పిల్లలకు పంపిణీ చేయాలని కోరారు. దీనిపై ఆయన పైవిధంగా స్పందిస్తూ అభినందించారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఐరాల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని లబ్ధిదారులకు పింఛన్లను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్టు సోమవారం ఎంపీడీఓ నిర్మలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

ఐరాల: మండలంలోని పొలకల పంచాయతీ రెడ్డివారిపల్లె ప్రాథమిక పాఠశాలలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, పంచాయతీ ఈఓ కుసుమకుమారి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈఓ మాట్లాడుతూ, కొత్త సంవత్సరంలో విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఖజానా శాఖ కార్యాలయంలో..

చిత్తూరు కలెక్టరేట్: స్థానిక మిట్టూరులోని ఖజానా శాఖ కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి చంద్రశేఖర్, సీనియర్ అకౌంట్ ప్రవీణ్‌కుమార్, ఉద్యోగులు శశికుమార్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్పీ రవికుమార్

నగరి: పట్టణంలోని డిగ్రీకళాశాల మైదానంలో నగరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను డీఎస్పీ రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. టోర్నీలో 20 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు అమృతరాజ్ నాడార్, గోవిందస్వామి, గోపి, బాలవర్ధన్‌రాజు తెలిపారు.

రైలు స్టాపింగ్‌కు వినతి

కుప్పంరూరల్ : షిరిడీ ఎక్స్‌ప్రెస్ రైలును కుప్పంలో నిలపాలని సోమవారం సౌత్ వెస్ట్రన్ రైల్వే డీఆర్‌ఎం శ్యామ్‌సింగ్‌కు పట్టణ వాసులు విన్నవించారు. సోమవారం బెంగళూరులోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సురేష్, బాలాజీ, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

వెండి కిరీటాల వితరణ



పుంగనూరు : పట్టణంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి విశ్రాంత ఎంఈఓ సరస్వతి తన భర్త రెడ్డెప్ప జ్ఞాపకార్థం రూ.2లక్షల విలువైన మూడు వెండి కిరీటాలను వితరణగా సోమవారం అందజేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా హరిప్రసాద్‌రెడ్డి

బంగారుపాళెం: ఇన్‌చార్జి ఎంపీడీఓగా హరిప్రసాద్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. యాదమరి మండలంలో ఈఓపీఆర్‌డిగా ఉన్న ఆయన యాదమరి, తవణంపల్లె మండలాలకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు బంగారుపాళెంను కూడా అదనంగా అప్పగించారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్ శ్రీధర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. హరిప్రసాద్‌రెడ్డిని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రా రెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, పలువురు నాయకులు కలిసి అభినందించారు.

సచివాలయం తనిఖీ

- యూనిఫామ్ ధరించకుండా హాజరైన సిబ్బందిపై ఆగ్రహం
- నేటి నుంచి పింఛను వారోత్సవాలు : జెడ్పీ సీఈఓ


సచివాలయంలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

యాదమరి: మండలంలోని మోర్దానపల్లె గ్రామ సచివాలయాన్ని సోమవారం సాయంత్రం జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పథకాలకు సంబంధించి బోర్డులు చిరిగిపోయి ఉండడం, సిబ్బంది అందరూ యూనిఫామ్ లేకుండా విధులకు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని, ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 3వ తేదీ నుంచి పింఛను వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మీనా పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో పలువురు ప్రముఖులు


ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, మోహన్‌రెడ్డికి స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ చైర్మన్


కుటుంబ సభ్యులతో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఐరాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త పూజారి మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వాసుదేవ రెడ్డి, తెలంగాణ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రిబ్యునల్ చైర్మన్ హరినాథ్, రాష్ట్ర ట్రిబ్యునల్ మెంబర్ పద్మ స్వామివారి దర్శనార్థం వచ్చారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. కార్యక్రమంలో టెంపుల్ సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: విద్యార్థులు చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడల్లోనూ రాణించాలని బోడబండ్ల జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం వెంకటరమణ అన్నారు. వివిధ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ, అండర్-19 వాలీబాల్ పోటీలలో 10వ తరగతి విద్యార్థినులు చందన, వైష్ణవి, అండర్-14 ఫెన్సింగ్ పోటీలలో 7వ తరగతి విద్యార్థిని దీక్షిత రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికై తమ స్కూలుకు పేరు తెచ్చారన్నారు. కార్యక్రమంలో పీఈటీ శాంతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల అంకెల గారడీ


విద్యార్థులు రూపొందించిన అంకెల చదరాలు

బంగారుపాళెం: అంకెల గారడీతో 2023 సంవత్సరానికి స్వాగతం పలికారు మండలంలోని మంగళపల్లె జెడ్పీ హైస్కూలు విద్యార్థులు. ఇక్కడ 10వ తరగతి విద్యార్థినులు చరిష్మ, చందన 4 X 4, 7 X 7 అంకెలతో ఎటు కూడినా 2023 వచ్చేలా పూరించారు. గణిత అవధాని అరుణ్ శివప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు తయారు చేసిన వింత చదరాలలో రకాలుగా ఎటు కూడినా 2023 వస్తుందని, ఇదే దీని ప్రత్యేకత అని ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు లలిత, ఉపాధ్యాయులు అభినందించారు.

హోటల్, స్వీట్ షాపుల్లో తనిఖీలు


స్వీట్ దుకాణంలో వాడుతున్న నూనెను పరిశీలిస్తున్న ఆహార తనిఖీశాఖ అధికారి సతీష్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని ఓ హోటల్, పలు స్వీట్ షాపుల్లో సోమవారం ఆహార తనిఖీశాఖ అధికారి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడారు. హోటల్‌లో చికెన్ తినడంతో ఫుడ్‌పాయిజన్ అయిందని ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశామన్నారు. హోటల్‌లో వాడుతున్న నూనె, చికెన్, ఫుడ్ తయారీ విధానం, స్టోరేజ్ మొదలైనవి పరిశీలించి శాంపిల్స్ సేకరించామన్నారు. వీటిని పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపుతామని 20 రోజుల తర్వాత రిపోర్ట్ వస్తుందని పేర్కొన్నారు. తదనంతరం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నగరంలోని 6 స్వీట్‌స్టాళ్లలో తనిఖీలు చేశారు. తినుబండారాలకు వాడుతున్న నూనెను పరిశీలించారు. నూనె క్యాన్లు, వాటి గడువు తేదీ, ఎన్నిసార్లు వాటిని వాడుతున్నారు? అనే వాటిని పరిశీలించారు. ఆహార తనిఖీ శాఖ సిబ్బంది నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో 9 వినతులు


అర్జీల స్వీకరిస్తున్న సహాయ కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన «స్పందన» కార్యక్రమంలో 9 వినతులు అందినట్లు సహాయ కమిషనర్ గోవర్ధన్ తెలిపారు. వినతులపై విచారణ చేసి పరిష్కరించాలని సహాయ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మెప్మా 4, ఇంజినీరింగ్ 3, టౌన్ ప్లానింగ్ 1, హౌసింగ్ 1 చొప్పున వినతులు వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంఈ ధనలక్ష్మి, ఎంహెచ్‌ఓ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: స్పందనకు వచ్చే అర్జీలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పార్వతి ఆదేశించారు. చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. వినతులను పరిశీలించి పరిష్కరించాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. మొత్తం వివిధ భూ సమస్యలకు సంబంధించి 19 అర్జీలు వచ్చాయని ఆమె చెప్పారు.

క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ



యాదమరి: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎస్టీయూ ఉపాధ్యాయుల 2023 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఎంపీడీఓ శివరాజ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల నాయకులు గుణశేఖర్, ఓబుల్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, వాసు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం


వలంటీర్లను సత్కరిస్తున్న జాఫర్

పలమనేరు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా లబ్ధిదారులకు అందిస్తున్న గంటావూరు వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జాఫర్ సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రమేష్, సెక్రటరీ జలంధర్, వెల్ఫేర్ అసిస్టెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

ఆలయంలో స్థానికులకు విలువ లేదా?

- గ్రామ సభలో పంచాయతీ అధికారులపై స్థానికుల ధ్వజం
- ఆలయం ముందు నిరసన


నిరసనకారులతో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక ఆలయంలో స్థానికులకు విలువ ఉందా, లేదా? అని గ్రామ సభలో స్థానికులు పంచాయతీ అధికారులపై ధ్వజమెత్తారు. సోమవారం మధ్యాహ్నం కాణిపాక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ, కాణిపాక ఆలయానికి వచ్చే వాహనాల రుసుం పంచాయతీకి 40 శాతం చెల్లించాల్సి ఉండగా ఆలయ అధికారులు చెల్లించడం లేదన్నారు. తమ భూములు ఆలయానికి విరాళంగా ఇచ్చి, ఆలయ అభివృద్ధి తమవంతు తోడ్పాటునిచ్చామని, అయినా ఆంగ్ల నూతన సంవత్సరంలో అలయంలో స్థానికులకు ఎలాంటి విలువ ఇవ్వలేదని మండిపడ్డారు. అలాగే అగరంపల్లెకు, కాలనీ ఇళ్లకు వెళ్లే దారులను సైతం బారికేడ్లతో మూసివేయడంపై నిరసన వ్యక్తం చేశారు. వీఐపీలకు మాత్రం గేట్లు తెరచి స్వామివారి దర్శనం కల్పిస్తున్నారని, స్థానికులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి జోక్యంతో వీరి నిరసనకు తెరపడింది. స్థానికులకు ఆలయంలో ఎలాంటి ఆంక్షలు లేవని, స్వామివారి దర్శనం ఎప్పుడైనా చేసుకోవచ్చని వారిని శాంతింపజేశారు. అలాగే వాహనాల పార్కింగ్ రుసుం పంచాయతీకి చెల్లిస్తామని ఈఓ వెంకటేశు చెప్పారు.

ఉపాధ్యాయినికి పూలే అవార్డు


పెంచలమ్మ

కుప్పంరూరల్ : మండలంలోని ఆవుల నత్తం పాఠశాల ఉపాధ్యాయిని ఎస్. పెంచలమ్మకు తిరుపతిలోని మహాత్మ జ్యోతిరావు పూలే ఫౌండేషన్ వారు అవార్డుకు ఎంపిక చేశారు. మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డు బహూకరించనున్నారు. ఈ సందర్భంగా పెంచలమ్మను ఎంఈఓ మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు చిట్టిబాబు, రాజ్‌కుమార్, గోపాలకృష్ణ, శరవణ, సుబ్బరామ్, కార్తికేయన్, కేశవులు, వెంకటేశయ్య, జగదీష్, వరలక్ష్మి, సంధ్య, భారతి, సునీత, సునంద అభినందించారు.